4. భవదీయ కృపను – బాగుగఁ జాటి – భువి నీ చిత్తమును = అవిధి నెం చక తీర్చి – యమిత బలముతోడ – నవగతి నీతి కి – రీటంబు నేఁ బొంద॥రమ్ము॥

5. నేను నీ కొరకే – నిత్యము బ్రతికి – నిన్ను గణుతించి = మానుగ 'భళా' యను – మంచి వాక్యము విని – దీన ప్రభుని సమా– ధానములో నేఁ జేర ॥రమ్ము॥

– యేసుదాసు జీవరత్నము

## 438 పవిత్ర హృదయము కొరకు ప్రార్థన

రా –శంకరాభరణము (చాయ : మన మొదటి తలిదండ్రుల్) తా–త్రిపుట

విమల హృదయ మిమ్ము – విదితంబు నినుఁ గొల్వ – యేసునాథా = నీదు విమల రక్తము చేత – విశదమౌ యెద నిమ్ము – విశ్వనాథా ॥విమల॥

1. అణఁకువ క్షమశాంత – మధికముగ నాకిమ్ము – ఆత్మనాథా = నీకుఁ బ్రణుతమౌ నా యెద – ప్రభునిపీఠము జేయు – మాత్మనాథా ॥విమల॥

2. నీ చిత్తమే యంచు – నీ పాదములఁ బట్టి – నిల్చియుందు = నిందు – నికరమౌ ప్రకటమౌ – సుకరహృదయ మిమ్ము – మేసునాథా ॥విమల॥

3. భయభక్తు లలరెడు – భావంబు నా కిమ్ము జీవనాథా = నన్ను – లయ జీవములయందు – జయశాలినిగఁ జేయు – మేసునాథా ॥విమల॥

4. పరిశుద్ధ హృదయంబు – పరమేశ నా కిమ్ము – ధరణిమీఁద = నన్ని – తరుణములను నాకా – దరణ మీవే యంచుఁ – దలఁప నాథా ॥విమల॥

5. నీ రూపము నిమ్ము – నినుఁ – బోలి నేనుండ – నిత్యనాథా = నీదు – సారూప్య మెదమీద – సంపూర్తిగా వ్రాయు – సత్యనాథా ॥విమల॥

6. ప్రేమపూరిత హృదయ – మేమరక నా కిమ్ము – ప్రేమనాథా = యెంతో ప్రేమమౌ సుమమౌ – నేమమౌ బ్రతుకిమ్ము – క్షేమనాథా ॥విమల॥

–ఆల్‌ఫ్రెడ్ త్యాగరాజు పామర్



## 439 పరిశుద్ధత కొరకు ప్రార్థన

రా –నాథనామక్రియ (చాయ : నా యేసునాథా – ననఁ జూడవే) తా–అట

సంపూర్ణ పరిశుద్ధి నిమ్ము– సత్య – సంపూజ్య సర్వజ్ఞ పరిశుద్ధ దేవా ॥సంపూర్ణ॥

1. నిర్మల మనసు రంజిల్ల – నిత్య – పరమానందంబు నా [1]యాత్మలో నెరపు = ధరణి శ్రమల నోర్వ నిమ్ము – పాప – పరితాప మనుదినం బభివృద్ధిపరచి ॥సంపూర్ణ॥

2. విశ్వాస సమృద్ధి నిమ్ము – నాదు – ఈశుండ శ్రీ యేసు ప్రేమ నెంచి సం = తోషంబుగ సేవించుటకు – నీదు – [2]నాశీస్సు దయచేయు దాస పోషకుఁడా ॥సంపూర్ణ॥

3. నాలోఁ గృతజ్ఞత నింపు – నన్ను ఁ – బాలించు ప్రభునికై – బ్రతుకంగ నిమ్ము = చాల తనదు మహిమఁ బొగడి – సర్వ – కాలంబు దన వాక్కుఁ గని పెట్టునట్లు ॥సంపూర్ణ॥

4. నా పాపములె యేసునాథున్ – ఘోర – [3]తాపా నిర్యాణంబు లందింపఁ జేసెన్ = నా పాపములకు దుఃఖింతున్ – దేవ – కాపాడుమీ నన్నుఁ బాపంబునుండి ॥సంపూర్ణ॥

5. పెక్కంత శుద్ధిని బొంది – నేను – ఇక్కట్ల నోడింప శక్తి నందిమ్ము = చిక్కులఁ బడి యుండునపుడు – నీతి – లోకమం దా సక్తి మిక్కుట పరచి ॥సంపూర్ణ॥

6. నీ రాజ్య ప్రవేశ మంది – తండ్రి – యా రాజ్య [4]శుశ్రూష నిల నేర్చునట్లు = పరిశుద్ధాత్మ సహాయ మిమ్ము – యేసు – ధరణి నీవలె నేను [5]వర్తించునట్లు ॥సంపూర్ణ॥

–ఎస్.బి. సైమన్

[1]వ్యాపింపఁజేయు. [2]దీవెన. [3]దుఃఖమును మరణమును. [4]సేవ. [5]చేయుబాగు